ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సోమవారం 24 జూన్ 2024

నేడు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యేల కోటాలో గెలుపొందిన 11మందితో పాటు పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఆరుగురు సహా 17మంది ఎమ్మెల్సీలు సోమవారం ఉదయం 11గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. విధానసౌధ బ్యాంక్వెట్‌హాల్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుందని విధానపరిషత్ కార్యాలయం ప్రకటించింది. పరిషత్ సభాపతి బసవ రాజ్ హొరట్టి ప్రమాణాలు చేయించనున్నారు.



సూరజ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


పోలీస్ వాహనంలో ప్రజ్వల్ (ఫైల్)

భవాని రేవణ్ణ

చిక్కుల్లో రేవణ్ణ కుటుంబం

- సూరజ్ అరెస్టు
- జ్యుడీషియల్ కస్టడీలోనే ప్రజ్వల్
- బెయిల్‌పైనే రేవణ్ణ, భవాని రేవణ్ణ

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి హాసన్ జిల్లాను సొంత గుత్తాధిపత్యంగా భావించి అభివృద్ధితోపాటు రాజకీయాల్లోనూ తిరుగులేని పదవులు సాధించిన జేడీఎస్ జాతీయనేత, మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు రేవణ్ణ కుటుంబం ప్రస్తుతం వివాదాల్లో కూరుకుపోయింది. రాసలీలల పెన్‌డ్రైవ్‌లు, లైంగిక దౌర్జన్యాల ఆరోపణల కేసులో రేవణ్ణ చిన్నకుమారుడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ అరెస్టు అయి జ్యుడీషియల్ కస్టడీలో గడుపుతున్నాడు. తాజాగా ఆదివారం రేవణ్ణ పెద్ద కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ ఆరోపణలతో అరెస్టు అయ్యారు. జేడీఎస్ కార్యకర్త ఒకరు ఈనెల 16న హొళెనరసీపురలోని ఫాంహౌస్‌లో ఉద్యోగం అడిగేందుకు సూరజ్‌ను భేటీ అయ్యారు. ఇదే సమయంలో సూరజ్ అసహజ లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు బాధితుడు చేతన్ ఆరోపిస్తున్నారు. హొళెనరసీపుర పోలీసులకు ఇదే విషయమై ఫిర్యాదు చేసేందుకు వారు నిరాకరించడంతో ఏకంగా డీజీపీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇక్కడి అధికారులు సూచించడంతో వివాదం వెలుగులోకి వచ్చింది. అంతలోనే బాధితుడిపై సూరజ్ ఆప్తుడు, అనుచరుడు శివకుమార్ హొళెనరసీపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడు రూ.5కోట్లు డిమాండ్ చేస్తున్నారని, కనీసం రూ.3 కోట్లు అయినా ఇవ్వాలని లేనిపక్షంలో రచ్చ చేస్తానని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈలోగా సూరజ్ రేవణ్ణ శనివారం రాత్రి పోలీసుల ముందు హాజరై బ్లాక్‌మెయిల్ చేసిన వివాదంతోపాటు అతడి వద్ద ఉండే ఆధారాలను చూపేందుకు వెళ్లారు. సీఐ ప్రదీప్‌కుమార్ తొలుత విచారణ జరిపారు. ఆ తర్వాత సకలేశపుర డీఎస్పీ ప్రమోద్‌కుమార్ విచారణ జరిపారు. మరోవైపు బాధితుడిని హాసన్ మెడికల్ కళాశాలలో వైద్య పరీక్షలకు ప్రయత్నించగా అతను అంగీకరించకపోవడంతో బెంగళూరు బౌరింగ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడికి బీపీ, షుగర్, ఈసీజీతోపాటు శరీరంపై ఉండే కొరికిన గుర్తులను పరీక్షించారు. ఇవే అంశాలపై సూరజ్‌ను ప్రశ్నించగా దాటవేయడంతోపాటు కేవలం బ్లాక్‌మెయిల్ అంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తుండడంతో సాక్ష్యాలను చూపారు. ఆడియోలను వినిపించారు. ఈమేరకు సూరజ్ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో తప్పు చేసినట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేసినట్లు ప్రకటించారు. సుమారు 20 గంటలపాటు సూరజ్‌ను పోలీసులు విచారణ జరిపారు. సాయంత్రం హాసన్ నుంచి బెంగళూరుకు సూరజ్‌ను తీసుకొచ్చిన పోలీసులు ప్రజాప్రతినిధుల న్యాయమూర్తి నివాసానికి తీసుకెళ్లారు. కోరమంగలలోని నేషనల్ గేమ్స్ విలేజ్ ప్రాంగణంలోని జడ్జి నివాసానికి రాత్రి తరలించారు. అతడిపై ఐపీసీ 377, 506, 342, 34 సెక్షన్‌లకింద కేసు నమోదు చేశారు. ఇలా సూరజ్ అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇక హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రాసలీలలు, లైంగిక దౌర్జన్యాల అంశం అంతర్జాతీయస్థాయిలో చర్చకు కారణమైన సంగతి తెలిసిందే. హాసన్‌లో పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడి వాటి వీడియోలను తీసుకోవడం, అవి పెన్‌డ్రైవ్ రూపంలో బయటకు రావడం తెలిసిందే. కొన్ని రోజులపాటు ప్రజ్వల్ విదేశాలకు పరారై ఎట్టకేలకు అరెస్టు అయ్యాడు. విచారణ ఎదుర్కొంటున్న ప్రజ్వల్‌కు పురుషత్వ పరీక్షలు జరిపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో పరప్పన అగ్రహార జైలులో గడుపుతున్నారు. ఇంకా ఎంత కాలం కేసుల పరంపర కొనసాగుతుందో వేచి చూడాలి. ఇక రేవణ్ణ ఇప్పటికే నిబంధనల బెయిల్‌పై గడుపుతున్నారు. ప్రజ్వల్‌పై లైంగిక దౌర్జన్యాల అంశాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసును ఎదుర్కొంటున్నారు. కిడ్నాప్ కేసులో నిందితురాలిగా ఉన్న భవాని రేవణ్ణకు రెండు రోజులకిందటే రెగ్యులర్ బెయిల్ వచ్చింది. ఇలా నలుగురూ కేసుల ఊబిలో కూరుకుపోయారు. కుటుంబం మొత్తం చిక్కుల్లో పడడంతో అభిమానులు అయోమయంలో పడినట్లయింది.



జ్యుడీషియల్ కస్టడీకి సూరజ్ రేవణ్ణ

హోమోసెక్స్ కేసులో అరెస్టు అయిన ఎమ్మెల్సీ రేవణ్ణను కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించింది. హాసన్‌నుంచి సూరజ్‌ను బెంగళూరుకు తీసుకొచ్చిన పోలీసులు 42వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి ముందు ఆదివారం రాత్రి హాజరు పరిచారు. ఈమేరకు న్యాయమూర్తి జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. పోలీసులు సమగ్ర విచారణ జరపాల్సి ఉన్నా సెలవు రోజు కావడంతో జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బాడీ వారెంట్ ద్వారా సూరజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నట్టు తెలిపారు.

పిల్లలకు తప్పులు చేయాలని చెబుతామా..?

- ప్రజ్వల్, సూరజ్ వివాదంపై కుమార



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కుమారస్వామి

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తప్పులు చేయమని చెబుతామా..? అంటూ కేంద్రమంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. అన్నకుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యాల కేసులో అరెస్టు కావడం, తాజాగా సూరజ్ రేవణ్ణ హోమో సెక్సువల్ వివాదంలో అరెస్టు కావడంపై ఆయన స్పందించారు. చెన్నపట్టణ తాలూకా భైరాపట్టణలో ఆదివారం బెంగళూరు పాల ఉత్పత్తిదారుల సంఘం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. చట్టానికి అందరూ సమానమే అన్నారు. తప్పు చేయమని పిల్లలకు చెబుతామా..? అన్నారు. ఉప్పు తిన్నవారు నీరు తాగాల్సిందేననీ, తప్పు చేసినవారు చట్టానికి తలవంచాల్సిందేనన్నారు. ఇదే సందర్భంలో చెన్నపట్టణ నుంచి నిఖిల్ పోటీచేసే విషయంపైనా స్పష్టత ఇచ్చారు. నిఖిల్ రెండు ఎన్నికల్లో ఓటమి చెందారన్నారు. అతడి ఓటమి బాధ ఏమిటో నాకు తెలుసునన్నారు. చెన్నపట్టణ నుంచి నిఖిల్ పోటీ చేసేది లేదని తేల్చి చెప్పారు. ఈ స్థానం నుంచి సీపీ యోగేశ్వర్ పేరు సిఫారసు చేస్తానన్నారు. లేదా జేడీఎస్‌లో ఎవరైనా అభ్యర్థి కావచ్చునన్నారు. ఎన్డీయే అభ్యర్థి ఎవరైనా కలసి పనిచేస్తామన్నారు. చెన్నపట్టణను ఏదో అభివృద్ధి చేస్తామని చెప్పుకుంటూ వచ్చినవారు తాలూకాకు రావాల్సిన 61 కోట్ల రూపాయల పాల ప్రోత్సాహక ధనాన్ని విడుదల చేయిస్తే బాగుంటుందని డీసీఎం డీకే శివకుమార్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

అటవీ భూముల్లో తవ్వకాలకు అనుమతించవద్దు

- స్వామిమలై భూములను కేఐఓసీఎల్‌కు ఇవ్వద్దు: అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే



బళ్లారి, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు సండూరు ప్రాంతంలోని దేవదారి రేంజ్ అటవీ భూమిని ఖుద్రేముక్ ఐరన్ ఓర్ కంపెనీకి అప్పగించవద్దని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే అటవీశాఖ అదనపు ముఖ్యకార్యదర్శికి సూచించారు. దీనికి సంబందించి అటవీ ఖాఖ మంత్రి లేఖ రాశారు. స్వామిమలై ఫారెస్టు బ్లాక్ లోని దేవదారి పరిధిలో ఉండే 401-576 హెక్టార్ల అటవీ భూమిలో ఇనుప ఖనిజం తవ్వకాలకు కేఐఓసీఎల్ అనుమతి పొందింది. దీనిపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అంగీకార సంతకం చేశారు. అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదు. ఈ విషయం తెలుసుకున్న పర్యావరణ ప్రేమకులు, ప్రజా సంఘాలు, పత్రికలద్వారా వెలుగులోకి తెచ్చాయి. సామిమలై అటవీ ప్రాంతంలోని దేవదారి రేంజ్‌లో ఖుద్రేముక్ సంస్థకు ఇనుము తవ్వకాలకు అనుమతి ఇస్తే పలు అనర్థాలు జరుగుతాయని ప్రజాసంఘాలు గొంతెత్తాయి. ఈవిషయం పై అటవీశాఖ అధికారులు కూడా జరిగే నష్టం గురించి వివరించారు. అక్కడ ఉండే అత్యంత ప్రాచీన, చాణక్యుల కాలంలో నిర్మించిన కుమారస్వామి దేవాలయానికి ముప్పు తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, అక్కడ నీరు, గాలి, కలుషితంగా మారి భౌగోళిక స్వరూపం మారుతుందని ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. పలు పత్రికలు ఈ విషయం పై కథనాలు రాసి వెలుగులోకి తెచ్చాయి. ప్రపంచ యోగా దినోత్సవం రోజున సీఎం సిద్దరామయ్య కూడా స్పందించారు. అలాగే రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే స్పందిస్తూ అటవీశాఖ అదనపు అధికారికి లేఖ రాశారు. సండూరు వద్ద ఉండే స్వామిమలై కొండలో దేవదారి బ్లాక్ లో ఉండే అటవీ భూమిని ఇనుము తవ్వకాలకు ఇవ్వదని ఆదేశాలు ఇస్తూ ఉత్తర్వులు రాశారు.

'స్వామిమలై ఫారెస్ట్‌లో మైనింగ్ తవ్వకాలకు నేను ఉత్తర్వులు ఇవ్వలేదు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి సండూరు వద్ద ఉండే స్వామిమలై అటవీ ప్రాంతంలో దేవదారి బ్లాక్ రేంజ్‌లో ఇనుము తవ్వకాలకు సంతకం చేసి అనుమతించారు. కాకపోతే మైనింగ్ తవ్వకాలకు సంబందించన ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపాను. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేఐఓసీఎల్‌కు అటవీ భూమి ఇచ్చారు. కానీ కేఐఓసీఎల్ కంపెనీ త్వకాలకు రూ. 1.786 కోట్లు అవసరం అని కోరింది ఇందుకు సంతకం చేసి ఆర్థిక శాఖకు పంపాను . మైనింగ్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూమి ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 518 కోట్లు చెల్లించారు. సండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. ఇదంతా గత రాష్ట్ర ప్రభుత్వ కాలంలోనే జరిగింది మొత్తం మీద సండూరు స్వామిమలై అటవీ భూమిలో కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ తవ్వకాలకు ఇవ్వవద్దు' అని మంత్రి అదనపు అధికారికి లేఖ రాశారు. భక్తుల మనోభావాలతోపాటు గిరిజనుల అభివృద్ధిని పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాపై కోపంతోనే అభ్యంతరం

: కేంద్ర మంత్రి కుమార స్వామి

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దేవదారి కొండల్లో గనుల తవ్వకాలకు అనుమతుల నిరాకరణ అంశంపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. దేవదారి కొండల్లో గనులకు కేంద్ర ఉక్కు, గనులశాఖ మంత్రి కుమారస్వామి అనుమతిచ్చారు. దీనిని పర్యావరణ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు చెన్నపట్టణలో ఆదివారం మీడియాతో కేంద్రమంత్రి కుమార మాట్లాడుతూ.. గనులకు అనుమతి ఇవ్వడంలో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఆ కంపెనీ కార్యకలాపాలు కొనసాగించేందుకు సంతకం చేశానన్నారు. వారికి రూ.1738 కోట్ల ఆవశ్యకత ఉందని, రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుంటున్నారన్నారు. ఆర్థికశాఖ అంగీకరించాల్సి ఉంటుందన్నారు. తన నుంచి కొత్తగా మైనింగ్‌కు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన నుంచి సీఎం ఏ నిరీక్షిస్తున్నారో చూడాలన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఒక మంత్రికూడా తనతో చర్చించలేదన్నారు. పాతమైసూరు ప్రాంతంలో కొత్త పరిశ్రమ తెచ్చే అంశం మాట్లాడానన్నారు. శాఖకు సంబంధించిన విషయాలు క్రోడీకరించుకోవాల్సి ఉందన్నారు. సర్ ఎం విశ్వేశ్వరయ్య, ఒడయార్‌ల హయాంలో ప్రారంభించిన సంస్థలు బెంగళూరులో అన్ని నాశనం చేశారన్నారు. ఐటీఐ, హెచ్ఎంటీ లాంటివి కనుమరుగయ్యాయన్నారు. తాను సంతకం చేశానని ఆ ప్రాజెక్టును నిలిపేందుకు సిద్ధమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

నీట్ వాయిదా కేంద్రం వైఫల్యమే

- ఉన్నత విద్యా శాఖా మంత్రి సుధాకర్ ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుధాకర్

బాగేపల్లి, జూన్ 23: నీట్ ప్రవేశ పరీక్షలను రద్దు చేయడం కేంద్రప్రభుత్వ వైఫల్యమేనని వెంటనే సరిదిద్దుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఆరోపించారు. పట్టణ శివారులోని సుంకలమ్మ దేవస్థానం వద్ద ఎమ్మెల్యే సుబ్బారెడ్డి నేతృత్వంలో చిక్కబళ్లాపుర లోక్‌సభ ఎన్నికల్లో బాగేపల్లి పరిధిలో కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు సాధించేలా శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెల్పుతూ ఆదివారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పాల్గొని మాట్లాడుతూ నీట్ పరీక్షకు తేదీ ఖరారైందని అందుకు లక్షలాదిమంది విద్యార్థులు సిద్ధమయ్యారన్నారు. అయితే అకస్మికంగా రద్దు చేయడంతో ప్రజల ఆగ్రహానికి కారణమైందన్నారు. వైద్యులు కావాల్సిన విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం సరికాదన్నారు. ఈ పరీక్షకోసం నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు అకస్మికంగా రద్దు చేయడం సముచితం కాదన్నారు. దీనికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శివశంకరరెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య పాల్గొన్నారు.

27న కొత్త ఎంపీలకు సీఎం విందు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలకు సీఎం సిద్దరామయ్య ఈనెల 27న విందు ఇవ్వనున్నారు. రాష్ట్రం నుంచి నలుగురు కేంద్రమంత్రులతోపాటు మిగిలిన 24మంది ఎంపీలను విందుకు ఆహ్వానించనున్నారు. 27న ఉదయం ఢిల్లీకి చేరుకునే ముఖ్యమంత్రి రాత్రి ప్రత్యేకంగా విందులో పాల్గొంటారు. లోక్‌సభలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించాలని ముఖ్యమంత్రి వారికి సూచించనున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అనుకూలమయ్యే ప్రాజెక్టులను సాధించేందుకు ఎంపీలు కలసికట్టుగా పనిచేయాలని పేర్కొననున్నారు. రాష్ట్ర అభివృద్ధికి చేతులు కలపాలని ముఖ్యమంత్రి కోరనున్నారు.




అందరి చూపు కుర్చీ వైపు..

- తెరపైకి మళ్లీ డీసీఎంల డిమాండ్
- అన్నివర్గాలకూ ప్రాధాన్యం ఇవ్వాలంటున్న నేతలు
- సీఎం సిద్దరామయ్యకు తలనొప్పిగా మారిన వైనం





బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్యకు మరో తలనొప్పి తప్పేలాలేదు. మంత్రివర్గ విస్తరణ ముందే పలువురు ఆశావహులు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అవకాశం దక్కకపోవడంతో నిరాశచెందిన నేతలు ఇప్పుడు డీసీఎం అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. ఎవరికివారు తమ ప్రాంతానికి, తమ కులానికి, వారి వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని, డీసీఎం పదవి కట్టబెట్టాలని డిమాండ్ చేస్తుండంతో పార్టీలో కలకలం మొదలయ్యింది. అయితే ఈ కొత్త డిమాండ్ డీసీఎం డీకే శివకుమార్‌కూ ఆందోళన కలిగించేలా ఉంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు సంచలనం అనిపించినా ప్రాధాన్యత కులాలకు ఉపముఖ్యమంత్రి పదవుల అంశానికి అధిష్టానం చెక్ పెట్టింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో డీసీఎంల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అధిష్టానంతోపాటు ముఖ్యులంతా చర్చించాకే ఉపముఖ్యమంత్రి పదవులను తేల్చాలని ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగుస్తున్న వేళ కేబినెట్‌లో డీసీఎంల అంశం ఎక్కడికి దారి తీస్తుందనేది ఉత్కంఠగా మారింది. ఒకే డీసీఎం కొనసాగాలని భావిస్తున్న డీకే శివకుమార్‌కు కేబినెట్‌లోని సహచరులతోనే సమస్య తలెత్తేలా మారింది. ఐదారు నెలలకిందటే ఈ ప్రస్తావన వచ్చింది. అయితే లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా డీసీఎం అంశాన్ని ప్రస్తావించరాదని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్టిమేటం జారీ చేయడంతో ఆ చర్చ అక్కడితో ఆగిపోయింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ అంశంపై మంత్రులు చెరో అభిప్రాయం వ్యక్తం చేస్తుండడం సర్వత్రా సందిగ్ధతకు కారణమవుతోంది. దళితులు, లింగాయత, మైనారిటీలలో ఒకరికి చొప్పున డీసీఎం పదవి ఇవ్వాలన్న డిమాండ్ బయట పడుతోంది. సీనియర్ నేత సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడైన మంత్రి రాజణ్ణ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను డీసీఎం రేసులో లేననీ, సీనియారిటీ, కులాల పరిగణనకు అనుగుణంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సీఎం మరో ఆప్తుడు జమీర్ అహ్మద్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మైనారిటీలకు డీసీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తామని అంటే మా మధ్య విబేధాలు ఉన్నాయని అర్థం కాదన్నారు. మరోవైపు సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి కొత్త ప్రతిపాదన చేశారు. డీకే శివకుమార్‌కు ప్రధాన డీసీఎంగాను, మిగిలినవారికి డీసీఎంగా పరిగణించేలా పోస్టులు ఇవ్వవచ్చునన్నారు. ఇలా ఏకంగా ముగ్గురినుంచి నలుగురి దాకా డీసీఎంల అంశం ప్రస్తావిస్తుండడం సీఎం సిద్దరామయ్యకు తలనొప్పిగా మారింది. మరోవైపు డీసీఎం డీకే శివకుమార్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ద్వారా డీసీఎంల అంశాన్ని పదే పదే ప్రస్తావించరాదని సూచించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనూ వేణుగోపాల్ ఇదే తరహాలో మంత్రులను హెచ్చరించిన విషయం తెలిసిందే.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.90	1,579.76
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	655	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,957	264
సామర్థ్యం (టీఎంసీలు)	5.46	4.18

కోలాచలం శ్రీనివాసరావుకు ఘన నివాళి



కోలాచలం శ్రీనివాసరావ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,జూన్ 23: కోలాచలం శ్రీనివాసరావు 105వ వర్ధంతి వేడుకను ఆదివారం నగరంలోని రాఘవ కళామందిరంలో రాఘవ మెమోరియల్ అసోషియేషన్, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు జ్యోతి వెలిగించి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కండక్టర్ పంపాపతి, చెల్లా అమరేంద్ర నాథ్ చౌదరి, బసవరాజ్, రామాంజనేయులు మాట్లాడుతూ నాటక రంగానికి వారు చేసిన సేవను స్మరించి కొనియాడారు. ఈసందర్భంగా గౌరవాధ్యక్షుడు కె.చన్నప్ప, అధ్యక్షులు కేటేశ్వరావు, కార్యదర్శి ఎన్.ప్రకాశ్, కృష్ణ, సురేంద్రబాబు, రామచంద్ర, శేషారెడ్డి, బసవరాజ్, శివసర్వేశరగౌడ, రఘునాథ్, భీమనేని భాస్కర్, రమణప్ప భజంత్రీ, కోలాచలం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



వారాహి పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

కంప్లి, జూన్ 23 : యువతీ యువకులు ప్రతి ఒక్కరు కవులు రచించిన పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కలబురిగి డాక్టర్ అంబేడ్కర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్ జోళద తెలిపారు. కంప్లి పట్టణంలో సాహిత్య రచయిత బండి దొడ్డ మంజునాథ్ రచించిన వారాహి పుస్తకాన్ని కంప్లి పట్టణంలోని గురుమఠంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది సాహిత్య కవులు వున్నారని, వారు వారికి తగ్గట్లు పుస్తకాలు రచించారన్నారు. సామాజిక విషయాలపైనా, దేశ సాంప్రదాయాల గురించి స్నేహితుల మధ్య అన్యోన్యత గురించి పుస్తకాలను రచిస్తారని, కనుక ప్రతి ఒక్కరూ ఇప్పుడున్న టీవీ, మొబైల్, కంప్యూటర్ల మోజులో పడకుండా ప్రతినిత్యం పేపర్లు, పుస్తకాలు చదివి తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఇంతకుముందే అరశమల్లిగే, తైలవిల్లద జ్యోతి, మంజుమల్లిగే లాంటి పుస్తకాలను ఆయన రచించారన్నారు. ఈ పుస్తకాలు ఇప్పటికే గ్రంథాలయాల్లోను, విశ్వవిద్యాలయాల్లోను అందరికీ అందుబాటులో వున్నాయన్నారు. ప్రతి ఒక్కరు వారాహి పుస్తకాన్ని కొనుగోలు చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం కన్నడ సాహిత్య పరిషత్, వివిధ సంఘ సంస్థ నేతలు, పాత్రికేయులు, వివిధ శాఖలు ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో షణ్ముఖ చిత్రగార్, డీవీ సత్యనారాయణ, అక్బర్, దొడ్డ బసవరాజు, వాసుకుమార్, హేమయ్యస్వామి, శిశిధర్ శాస్త్రి, గంగాధరయ్య, వెంకటేష్, మిష్టిరుద్రప్ప, అంబిగర మంజునాథ్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బళ్లారిరూరల్, జూన్ 23 : బళ్లారి నగరం కౌల్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న మంజున్నయ్య, తరుణ్ కుమార్ నాయక్‌లను అదుపులోకి తీసుకుని వారినుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.ఆరు లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, 280 గ్రాముల వెండి ఆభరణాలు, వాటితో పాటు రెండు మొబైళ్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. కేసును సిటీ డీఎస్పీ చంద్రకాంత్ రెడ్డి, కౌల్‌బజార్ సీఐ సుభాష్ చంద్ర బోస్‌ల ఆధ్వర్యంలో క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ లారెన్స్, ఎస్ఐలు శ్యామల, సర్దార్, ముజాహిద్ అలీలు దర్యాప్తు చేశారు.

ఓహో! మేఘమాలా!



హంపీ ఉగ్రనరసింహ స్వామి ఆలయం వద్ద కమ్ముకొస్తున్న మేఘాలు

చల్లగా రావేలా! మెలమెల్లగా రావేలా!

కంప్లి, జూన్ 23 : దక్షిణ కాశీగా పేరొందిన హంపీలో ఇటీవల ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఏ చెట్టుకొమ్మచూసినా పచ్చగానే కనిపిస్తోంది. నిన్న కురిసిన వర్షానికి ముందుగా ఉగ్రనరసింహ ఆలయం వద్ద మేఘాలు బారులు తీరాయి. దేవస్థానం వెనుకభాగంలో మండపాల వద్ద సమావేశమైన మేఘాలు పూర్తిగా పర్యాటకులను ఆకట్టుకుని సంతోషాన్ని పంచుతున్నాయి. తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు, కేరళ, విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు మాట్లాడుతూ, ఈ పుణ్యక్షేత్ర సౌందర్యం ఇప్పటికీ తమ మనసుల్లో నిలిచిపోతోందని ఆనందపడుతున్నారు. ఇక్కడ ప్రతి ఒక్కటి మళ్లీ, మళ్లీ చూడాలనిపించేలా వున్నాయని ఇక్కడ ఎన్నిరోజులు పర్యటించినా తనివితీరడంలేదని తెలిపారు. రెండు మూడు రోజులు సెలవులు రావడంతో హంపీకి పర్యాటకులు పోటెత్తారు.

ఫుట్‌పాత్ నిర్మాణానికి వేస్ట్‌మట్టి



రోడ్డుప్రక్కన చదును చేసిన చెత్తమట్టి

● కళ్యాణ కర్ణాటక నిధులు నీళ్లపాలు ● పత్తాలేని క్వాలిటీ కంట్రోల్ అధికారులు ● నోటీసు లేకుండానే పనుల ప్రారంభం

బళ్లారి గాంధీనగర్, జూన్ 23: వడ్డించేవాడు మనోడైతే ఎంత తింటే ఏముందిలే అన్న రీతిలో ప్రజాపనుల శాఖ తయారైంది. కళ్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డు(కెకెడిబి) నిధుల క్రింద ప్రజా పనుల శాఖ చేబడుతున్న అభివృద్ధి పనులు నీరు గారిపోతున్నాయనడానికి పైన కనిపిస్తున్న దృశ్యాలే నిదర్శనం. మోకారోడ్డులోని కెఈబి సర్కిల్ నుంచి కెఆర్ఎస్ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం కెకెడిబికి చెందిన సుమారు రూ 2.49కోట్ల రూపాయలతో ప్రజాపనులు శాఖ పనులు ప్రారంభించింది. పనులు ప్రారంభమైనప్పటి నుంచి ప్రజా పనుల శాఖ అధికారులు ఇటువైపు తిరిగి చూడలేదు. పనులు పొందిన కాంట్రాక్టరు ఎలా పనులు చేస్తున్నాడు..? ఎలాంటి మెటీరియల్ ఉపయోస్తున్నాడనే పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్లు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారింది. 132వ రాష్ట్ర రహదారిలో జరుగుతున్న ఈ అభివృద్ధి పనులు ఎస్టిమేట్‌లో పొందుపరిచిన విధంగా జరగడం లేదు.

పనులకు ముందు ఎర్త్‌వర్క్‌లో నిబంధనలు పాటించడం లేదని, గ్రావెల్ ఉపయోగించాల్సిన స్థానంలో చెత్తా, చెదారాలు, వ్యర్థ పదార్థాలతో కూడిన పనికిరాని మట్టిని ఇప్పటికే రోడ్డు ప్రక్కన కుప్పలు.. కుప్పలుగా వేశారు. ఈ విషయంపై ప్రజా పనుల శాఖ అధికారులను అడిగితే.. నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలో పనులు ఇంత నాసిరకంగా జరుగుతుంటే... ఇంక గ్రామీణ ప్రాంతాల్లో పనులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. పేరుకు ప్రజా పనుల శాఖ గాని...అంతా ప్రైవేట్ పనుల శాఖగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లో ప్రస్తుతం ప్రజా పనుల శాఖ, బళ్ళారి సిటీ కార్పొరేషన్ నడుస్తోంది. స్థానికంగా ఎంతో మంది పేరొందిన కాంట్రాక్టర్లు ఉన్నా.. బలవంతంగా తమ పేర్లతో టెండర్లు వేయించి అనుభవం లేని ఇతర, బయటి వ్యక్తులు వచ్చి నగరంలో పనులు చేసే వాతావరణం నెలకొందని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులకు చెందిన సంబంధీకులు, బంధువులు వచ్చి నగరంలో పనులు చేస్తుంటే చేతులు కట్టుకుని ఏమి చేయలేక చూస్తున్నామని నగరానికి చెందిన కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మోకా రోడ్డులో జరుగుతున్న పనులను నగరానికి చెందిన కేదర గౌడ అనే కాంట్రాక్టరు పేరుతో స్థానిక ప్రజా నాయకుడి అనుయాయులు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు సంబంధించి కాంట్రాక్టరు అగ్రిమెంట్ అయిన వెంటనే సంబంధిత వివరాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారులకు తెలపాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు స్థల పరిశీలన చేసి, ఏస్టిమేట్ ప్రకారం సదరు కాంట్రాక్టరుకు చెప్పిన తరువాతనే పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే నగరంలో పనులు పూర్తి అయిన తరువాత సంబంధిత కాంట్రాక్టరు, పనులు చేపట్టిన ఏజెన్సీ కలిసి పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల నుండి పత్రాలు పొంది... బిల్లులు డ్రా చేసుకోవడం ప్రస్తుతం జరుగుతోంది. జిల్లా అభివృద్ధి కోసం కెకెడిబి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా... ఇలాంటి నాసిరకం పనులతో నిధులు నీరుగారిపోతున్నాయి.

సాక్షరభారతి విద్యార్థులకు పరీక్షలు



పరీక్షలు రాస్తున్న సాక్షరతా శిక్షణ పొందినవారు

సిరుగుప్ప, జూన్ 23 : తాలుకాలోని కే సూగూరు గ్రామంలో సాక్షరతా పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలను విద్యాశాఖ సంయోజకులు తమ్మన్నగౌడ పాటిల్, జిల్లా విద్యాశాఖ సాక్షరతా సంయోజకులు శివ బెటిగేరి పర్యవేక్షించారు. తాలుకాలోని 700లకు పైగా నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారేందుకు ఈ పరీక్షలను నిర్వహించారు. తాలుకాలో అక్షరాస్యత శాతం పెరుగుదలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి
భవన నిర్మాణ కార్మికుల డిమాండ్



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షణ్ముగం

బళ్లారి సిటీ, జూన్ 23: భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కర్ణాటక స్టేట్ యునైటెడ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షణ్ముగం డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులకు స్కాలర్‌షిప్‌లు చెల్లించడంలేదని, పిల్లలు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. సంక్షేమ బోర్డులో వేలల్లో డబ్బులు వృధా అవుతున్నాయని, అవినీతికి పాల్పడుతున్నారని, బోగస్ కార్డులను అరికట్టాలనే నెపంతో కార్మికులకు రావాల్సిన సొమ్ము స్వాహా చేస్తున్నారన్నారు.మొత్తానికి కాంగ్రెస్, బాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడి దారీ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికుల జీవనం మరింతగా దిగజారిందన్నారు. తదుపరి సంఘం కార్యదర్శి దేవదాసు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సమాజానికి మూల స్థంబాలని,కానీ ఇతరుల కోసం అందమైన భవనాలు నిర్మించేందుకు దినదినగండగా శ్రమిస్తూ కష్టతరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. జిల్లాకార్యదర్శి డా.ప్రమోద్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. పెట్టుబడిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, కానీ కార్మికుల ప్రయోజనాలను చెత్తబుట్టలో పడేశారన్నారు. ఈసందర్భంగా సంఘం జిల్లానాయకులు సురేశ్, శర్మ, నీలప్ప, జయరాజ్,అంజిని తదితరులు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీల చలో బెంగళూరు



మాట్లాడుతున్న అర్కానీ తదితరులు

బళ్లారి సిటీ, జూన్ 23: పాఠశాలల్లో ప్రీస్కూల్ తరగతుల ప్రారంభం కోసం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం చలో బెంగళూరు చేపట్టామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అర్కానీ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కల్యాణ కర్ణాటక 7జిల్లాల్లోని 1,008 పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభమవుతున్నాయని, ఇందుకోసం ఉపాధ్యాయుల, సహాయకుల నియామకానికి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడే ప్రమాదం ఉందని, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉపాధి కోల్పోతారన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను అంగన్‌వాడీల్లో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీనికి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ఎన్నుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం బెంగళూరులో భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. వేలాది మంది అంగన్‌వాడీ ఉద్యోగుల భవిష్యత్తుకు గుదిబండగా మారిన ఈనిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ నిరసనలో కల్యాణ కర్ణాటక ఏడు జిల్లాల అంగన్‌వాడీ ఉద్యోగులు, రాష్ట్రస్థాయి పదాధికారులు, ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లాప్రధాన కార్యదర్శి ఇ.మంగమ్మ, బి.ఈరెమ్మ, మంగళ గౌరి, ఇందిర, జగదీశ్వరీ, సీనియర్ కార్మికుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చెరువుల్లో పాచిపట్టిన నీరు



పాచి పట్టిన చెరువులోని నీరు

బళ్లారి సిటీ, జూన్ 22: సిరుగుప్ప తాలూకాలోని పలు గ్రామాల్లో తాగునీటి చెరువులు దాదాపు ఖాళీ కావడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. సిరుగుప్ప తాలూకాలోని ఉప్పరహోసళ్ళి, బలకుంది, మైలాపూర్ గ్రామాల్లో నివసిస్తున్న 14వేల మందికి నీటిని సరఫరా చేస్తున్న చెరువులను నిర్వహించే కాంట్రాక్టర్లు కృషి చేయకపోవడంతో చెరువులు ఖాళీగా ఉన్నాయి. అలాగే పదిరోజులకు ఒకసారి నిలిచిన నీటిని గ్రామానికి విడుదల చేస్తున్నారని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మైలాపూర్ సరస్సు దాదాపు ఖాళీ కావడంతో మిగిలిన నీరు నిలిచిపోయి పాచిపట్టిపోయాయని, రోగాలు వస్తే ఎవరూ బాధ్యత వహిస్తారని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను మరమ్మతులు చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్థుడు మల్లికార్జున వాపోయాడు. బలకుంది గ్రామపంచాయితీ అధ్యక్షురాలు సునీత రుద్రముని మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల అన్ని గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తికాలేదని, కాల్వల నుంచి సరస్సుకు నీరు నింపడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పనులు చేయడం లేదన్నారు.

చిరుత దాడిలో గొర్రె మృతి

బళ్లారి సిటీ,జూన్ 23: హొసపేట జంబునాథనహళ్ళి పరిధిలోని రాయరచెరువు ప్రాంతంలోని పొలంలో ఓ చిరుత ఆదివారం జంబయ్యకు చెందిన గొర్రెపై దాడి చేసి చంపేసింది. దీంతో పొలాల్లో పనిచేయాలంటనే భయపడేపరిస్థితి నెలకొందని ఇక్కడ తరచుగా పులి దాడులు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. ఇక్కడ తరచుగా పులి దాడులు జరుగుతున్నాయని. ఏకంగా ఇక్కడ నాలుగు చిరతపులు లు సంచరిస్తున్నాయన్నాయని, గ తంలో ఇదే మాదిరిగా గతంలో ఐదు గొర్రెలు, అరు కుక్కలను, రెండు ఆవులను చిరుత చంపిందని రైతు జంబయ్య తెలిపారు. చిరుతను పట్టుకుని భయాన్ని తొలగించాలని రైతులు కోరారు.

పర్యావరణంపై దృష్టి సారిద్దాం! / బీజేపీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి సిద్దార్థ సింగ్

బళ్లారి సిటీ,జూన్ 23: పర్యావరణంపై మనమంతా దృష్టి సారించాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి సిద్దార్థ సింగ్ అన్నారు. హంపీలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్మారకార్థం ఆదివారం పర్యావరణ దినోత్సవ ం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికి పర్యావరణ అవగాహన తప్పనిసరని, రోడ్లు, పాఠశాల ఆవరణలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి ఆవరణలతో సహా ప్రతిచోటా మొక్కలు నాటాలన్నారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దామన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జనసంఘ్ స్థాపించి కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా దేశ రక్షణ కోసం పోరాడారన్నారు. ఆయన పోరాట ఫలితంగా ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కాగలిగారన్నారు. మన దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారని, వారి కృషి ఫలితంగా దేశం ఆర్థికంగా బలపడుతోందన్నారు. అన్ని రంగాల్లో పురోగతి సాదిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా బాజపా జిల్లా అధికారి ప్రతినిధి అశోక్ జీరె, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు కిచిడి కొట్రేశ్, మండలాధ్యక్షుడు శంకర్‌మేటీ, నగర విభాగ అధ్యక్షుడు రేవణసిద్దప్ప, నాయకులు రజనీగౌడ, నాగరాజ్, చందు దేవలాపూర్, హొన్నూరప్ప, మధురచన్నశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న బీజేపీ ప్రముఖులు

హోసూరు జోన్

కెలవరపల్లి డ్యామ్‌లో పెరిగిన నీటిమట్టం



డ్యామ్‌నుంచి విడుదలవుతున్న నీరు

హోసూరు, జూన్ 23: హోసూరు పక్కనే ఉన్న కెలవరపల్లి ఆనకట్టకు కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణాపెన్నానది పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలపై ఆధారపడి నీటి ప్రవాహం ఉంటుంది. డ్యాం కింద 8 వేల ఎకరాల సాగు భూమి ఉంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ఆధారంగా డ్యామ్‌కు నీటి ప్రవాహం పెరుగుతూ వచ్చింది. గతవారం పరీవాహక ప్రాంతాల్లో ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. దీంతో డ్యాంలోకి 900 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో తగ్గింది. ఇన్ ఫ్లో 300 క్యూబిక్ అడుగుల నుంచి 469 అడుగులకు పెరిగింది. దీంతో డ్యాం నుంచి రోజూ 524 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం కూడ అదే అదేస్థాయిలో విడుదలైంది. డ్యాం సామర్థ్యం 44.28 అడుగులకు గాను 39.52 అడుగుల నీరు చేరింది.

పెరిగిన నేరేడు పండ్ల విక్రయాలు

హోసూరు, జూన్ 23: హోసూరు ప్రాంతంలో నేరేడు పండ్ల విక్కయాలు పెరిగాయి. డెంకణీకోట, తళి, జవలగిరి, అంచెట్టి, స్థానిక కొండప్రాంతాల్లో నేరేడు పండ్లు పండిస్తున్నారు. కాని నేరేడు పండ్ల దిగుబడి సరిగ్గా లేకపోవడంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా పండించే జంబూ నేరేడు పండ్లు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఔషధగుణాలు కల్గిన నేరేడుపండ్లు ఈ సీజన్‌లో స్వీకరించడం ద్వారా మధుమేహం సైతం నియంత్రణ అవుతుందని వైద్యనిపుణులు సూచిస్తుంటారు. కిలో నేరేడు పండ్లు రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. జంబు నేరేడు పండ్లకు ప్రస్తుతం మంచి డిమాండ్ నెలకొంది.

గులాబీ తోటలకు బడ్ క్యాప్స్

హోసూరు, జూన్ 23: హోసూరు సమీపంలోని బాగలూరు వద్ద గులాబీ తోటలు బడ్స్ క్యాప్ అని పిలువబడే మొగ్గలతో కప్పబడి ఉంటాయి. ఒక వారం పాటు బడ్‌క్యాప్ గులాబీ పూల మొగ్గలలో రేకులు త్వరగా వికసించకుండా సహాయపడుతుంది. ఇలా క్యాప్ వేయడం వల్ల గులాబీ పువ్వు మరిన్ని ఎక్కువరోజులు నిల్వ ఉండేందుకు వీలవుతుందని నిర్వాహకులు అంటున్నారు.



బడ్‌క్యాప్స్ తొడిగిన గులాబీ తోట

వెనుకబాటుతనాన్ని తుడిచిపెడదాం: ఎంపీ



వాణిజ్యోద్యమ సంఘం నాయకుల సభలో మాట్లాడుతున్న ఎంపీ

రాయచూరు, జూన్ 23 : సాహిత్య సౌరభానికి ప్రతీకగా ఉండే రాయచూరు ప్రాంతం వెనకబడినదిగా ఉండడం మనందరికి విచారకరమని లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ వ్యాఖ్యానించారు. ఆ వెనబాటుతనాన్ని పాల ద్రోలేందుకు అన్ని వర్గాల వారు ఏకమై కృషి సాగించినప్పుడే జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రాయచూరు వాణిజ్యోద్యమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ, రాష్ట్రంలోనే అత్యధికంగా పన్నులు చెల్లించే ప్రాంతమైన రాయచూరు ప్రత్యేక అవసరాలుగల జిల్లాగా కేంద్ర ప్రభుత్వం వద్ద గుర్తింపు పొందడం శోచనీయమన్నారు. దీనిని నిర్మూలించేందుకు నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తనకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. జిల్లాకు ఎయిమ్స్‌ను సాధించి పెట్టడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వార జిల్లాకు గరిష్ట ప్రయోజనాలు సాధించి పెట్టేందుకు అందరి సహకారంతో పని చేస్తానన్నారు. రవాణాపరంగా అత్యంత అనుకూలవంతులున్న రాయచూరును పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చేసేందుకు కావల్సిన అన్ని అనుకూలతలు ఉన్నాయని ఆ దిశగా మరింత మెరుగైన ప్రయత్నం సాగిస్తానన్నారు. జిల్లా సమగ్ర స్వరూపం పట్ల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి భోసరాజులకు స్పష్టమైన అవగాహన ఉందన్న ఎంపీ వారి సలహాలు సూచనలను పాటిస్తు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. ఇప్పటికే రోడ్ల అభివృద్ధిపై సంబంధించి ప్రత్యేకంగా దృష్టి సారించామని మిగతా అన్ని రంగాల అభివృద్ధి కోసం మరింత పట్టుదలతో శ్రమిస్తానన్నారు.

బిల్డింగ్ పైనుంచి దూకి యువతి ఆత్మహత్య

రాయచూరు, జూన్ 23 : నగరంలోని దేవర కాలనీలో ఉన్న మహిళ స్వాంతన కేంద్రం వద్ద ఓ యువతి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. కొన్నాళ్ల క్రితం నుంచి స్థానిక మహిళ స్వాంతన కేంద్రంలో ఉంటున్న ఆ యువతి బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడడం ప్రేమ వ్యవహారం విఫలం కావడంతోనేనని పోలీసులు గుర్తించారు. అనురాధ(19) అనే యువతి వినోద్‌రెడ్డి అనే యువకుడిని ప్రేమించగా.. తమ కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో ప్రేమికులిద్దరు పోలీసులను ఆశ్రయించారు. అబ్బాయి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురైన యువతిని మహిళ స్వాంతన కేంద్రానికి తరలించారు. ఆమెకు ప్రేమికుడు కూడా పెళ్లి చేసుకునేందుకు ఇష్టంలేదని చెప్పడంతో బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

కోచిముల్ విభజనకు కట్టుబడ్డాం



డెయిరీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్ తదితరులు

ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, జూన్ 23: చిక్కబళ్ళాపుర జిల్లా ఏర్పడి ఒకట న్నర దశాబ్దామవుతోందని కోచిముల్ విభజనకు తమకు అభ్యంతరం లేదని అయితే పాలసమాఖ్య మనుగడకోసం శాస్త్రీయంగా, వ్యవస్థీకృత విధానాలతో విభజన జరగాల్సి ఉందని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దొడ్డబొమ్మనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సంహకార సంఘం నూతన భవనం, బీఎంసీ నూతన విభాగం, పాల సేకరణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కోచిముల విభజన వేళ ఆత్రుతగా ప్రక్రియకు సిద్ధమైందన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లా డైరెక్టర్ అస్థిత్వం కోల్పోయిందన్నారు. మన ప్రాంత సభ్యులు కూడా చర్చల్లో పాల్గొనలేదన్నారు. దీంతో ఈ అంశం కోర్టుకు చేరిందని వివరించారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో పాల సేకరణ దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా విభజన జరగాల్సి ఉందన్నారు. అవిభాజ్య చింతామణిలో తొలిసారిగా పాల సేకరణ కేంద్రం ఏర్పడిందన్నారు. తమ తండ్రి ఎన్నికల్లో ఓడిపోకుంటే కోచిముల్ చింతామణిలో నెలకొనేదన్నారు. భౌగోళికంగా చింతామణిలో స్థాపించబడాల్సి ఉన్నప్పటికీ తమ తండ్రి చౌడరెడ్డి 1985లో ఓటమి చెందాక ఐఏఎస్ అధికారి సి మునిస్వామి కోలారు సమీపాన ఏర్పాటు చేశారన్నారు. సహకారసంఘాల డెయిరీలకు బదులు ఇప్పటికీ కొన్నిచోట్ల పాల సేకరణ ప్రైవేట్ డెయిరీలలో అవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాడి రైతులకు ప్రోత్సాహకధనం ఆరు నెలల బకాయి ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న బకాయి ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై పడిందన్నారు. పాలడెయిరీ సంఘాల ఎన్నికల్లో దుబారాకు అడ్డుకట్ట వేయడం, కేవలం పాలు కొలిచేవారు మాత్రమే ఓటు వేసేలా చేయడం, ఇతరత్రా అంశాలు త్వరలోనే అమలు చేయదలిచామన్నారు. పార్టీలకు అతీతంగా డెయిరీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, కోచిముల్ అధ్యక్షుడు, మాలూరు ఎమ్మెల్యే కేవై నంజేగౌడ, కోచిముల్ డైరెక్టర్‌లు అశ్వత్థనారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి



ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభంలో ప్రముఖులు

బంగారపేట, జూన్ 23: ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాధించాలంటే వాటిలో మీ పిల్లలను చేర్పించడం ద్వారా ఆదరించాలని ఆహాహ్వన్ ఫౌండేషన్ సీఈఓ బ్రజా కిశోర్ ప్రధాన్ పేర్కొన్నారు. తాలూకాలోని సిద్దనహళ్ళి గ్రామంలో పాఠశాల నూతన భవనాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిశోర్‌ప్రధాన్ మాట్లాడుతూ సుందరం అయ్యర్ సహకారంతో కేవలం 120 రోజుల్లోనే పాఠశాల నూతన భవనాన్ని నిర్మించి గ్రామస్తులకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలను కాపాడుకోవడం గ్రామస్తులు, ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. ఇటీవలి కాలంలో గుణాత్మక విద్యకోసం పలువురు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అయితే ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ గుణాత్మక విద్య అందుతోందన్నారు. కొన్నిచోట్ల మౌలిక సదుపాయాలు కొరత ఉన్నమాట నిజమేనని అయినంత మాత్రాన విద్యలో లోటు లేదన్నారు. కోలారు జిల్లాలో 27 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఓలి వైబ్రేటర్స్ ఇండియా సంస్థ ఎండీ సుందరం అయ్యర్ మాట్లాడుతూ సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా పిల్లల విద్యాప్రగతికి తమవంతు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి స్వచ్ఛందసంస్థలు కూడా సహకారం అందిస్తే మరింత ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సుగుణ మంజునాథ్, పీడీఓ శంకర్, కార్యదర్శి సుకన్యా, ఈసీఈ అబ్దుల్‌వాజీద్, అబ్దుల్‌గణి తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి వ్యక్తిగత కార్యదర్శిగా తేజస్వినాయక్

కేంద్రమంత్రులకు వ్యక్తిగత కార్యదర్శుల నియామకం

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి వ్యక్తిగత కార్యదర్శిగా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి తేజస్వినాయక్‌ను నియమించారు. ఉత్తరకన్నడ జిల్లాకు చెందిన నాయక్ భారీ పరిశ్రమలశాఖను పర్యవేక్షించనున్నారు. గతంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్‌ముండాకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. ఐఎఫ్ఎస్ అధికారి తాకత్‌సింగ్ రణావత్‌ను కుమారస్వామి పర్సనల్ సెక్రటరీగా నియమించారు. ఇతను ఉక్కు శాఖను పర్యవేక్షించనున్నారు. రణావత్ గతంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజెకు వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరించారు. కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి ఎస్ఎస్ నకుల్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా మరో సారి నియమించారు. నకుల్ ఆర్థిక మంత్రిత్వశాఖను పర్యవేక్షించనున్నారు. కర్ణాటక కేడర్‌కు చెందిన మరో ఐఏఎస్ అధికారి అనిరుధ్‌శ్రవణ్ కూడా నిర్మలా సీతారాన్‌కు పీఎస్‌గా వ్యవహరించనున్నారు. కార్పొరేట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఇరువురు అధికారులు గతంలోనూ నిర్మలాసీతారామన్‌కు పీఎస్‌లుగా వ్యవహరించినవారే.

ఖర్గే సన్మానానికి కసరత్తు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను భారీగా సన్మానం చేసేందుకు కసరత్తు చేస్తు న్నారు. 371 జే ఆర్టికల్ తీసుకురావడంతో పాటు సామాన్యవర్గాలకు అండగా నిలిచినట్టయ్యిందని పార్టీ అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో కల్యాణ కర్ణాటక ప్రాంతంలో ఎక్కువస్థానాలు గెలుపొందడం ద్వారా ఉత్సాహంలో ఉన్న పార్టీ వర్గాలు ఖర్గేను సన్మానించదలిచాయి. కల్యాణకర్ణాటకలో కలబురగి, రాయచూరు, కొప్ప ళ, బళ్ళారి, బీదర్ ఐదుస్థానాల్లో పార్టీ గెలుపుపై సంతోషంలో ఉన్నారు. సీఎం, డీసీఎం లతో చర్చించి బహిరంగసభకు తేదీ ఖరారు చేయాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. కల్యాణ కర్ణాటక ప్రాంతానికి 371 జే ద్వారా ప్రత్యేక గ్రాంట్లు, ఉద్యో గాలు లభిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా వాటి అమలుకు దోహదపడుతోందన్నారు. ప్రత్యేక ఆర్టికల్ వచ్చి పదేళ్ల పూర్తి అవు తున్న సందర్భంగా అన్నింటికీ కలిపి సన్మానం చేయదలిచారు. సోమవారం నుంచి లోక్ సభ సమావేశాలు ఉన్నందున ముగిసిన తర్వాత సన్మానం ఏర్పాటు చేయదలిచారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



కిత్తగనూరు చెరువు అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే మంజులా లింబావళి, మాజీ మంత్రి అరవింద లింబావళి తదితరులు

మహదేవపుర, జూన్ 23: మహదేవపుర శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బిదరహళ్ళి, కిత్తగనూరు, మండూరు, నింబెకాయపుర, దొడ్డబనహళ్ళి బిదరె అగ్రహార, వాలెపుర గ్రామాలలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చడంతోపాటు భూమిపూజ చేశారు. మాజీ మంత్రి అరవింద లింబావళి కూడా పాల్గొన్నారు. బిదరహళ్ళిలో వివేక పథకం కింద నూతనంగా నిర్మించిన పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు. కిత్తగనూరు, నింబెకాయపుర, బిదరె గ్రామాలలో ఫోర్స్ జిడబ్ల్యు, యునైటెడ్‌వే సహకారంతో సీఎస్ఆర్ నిధులకింద చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దొడ్డబనహళ్ళి గ్రామంలో అవసర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ కోర్టును, వాలెపరు గ్రామంలో శుద్ధ తాగునీటి కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమాలలో గ్రామీణ విభాగం బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, పట్టణ విభాగం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రముఖులు మహేంద్రమోది, శ్రీధర్, బాబురెడ్డి, వేణు, రాజేశ్ విద్యాశాఖ అధికారి రామమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ మంజునాథ్‌కు ఆత్మీయ సన్మానం



డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు గజమాలతో సత్కారం

దొమ్మసంద్ర, జూన్ 23: బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు ఆత్మీయ సన్మానం చేశారు. ఆనేకల్ తాలూకా చందాపుర సన్‌ప్యాలెస్ కల్యాణమండపంలో బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. వేలాదిమంది కార్యకర్తలు పాల్గొని గజమాలతో ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను సత్కరించారు. జయదేవ ఆసుపత్రి డైరెక్టర్‌గా అందించిన సేవలే విజయానికి కారణమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి ఏ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ కార్యకర్తల అభిమానంతోనే విజయం సాధ్యమైందని, ఈ గెలుపు మీ పాదాలకు అర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే మావంటి శాంతిప్రియులకు గెలుపు లభించిందన్నారు. కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆకాశ్ హిరేమఠ్ హత్యకేసులో 8 మంది అరెస్టు



ఆకాశ్ హిరేమఠ్ (ఫైల్)

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో ఆకాశ్ హిరేమఠ్ హత్యకేసులో 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. హుబ్బళ్ళిలోని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు శేఖరయ్య మఠపతి కుమారుడు ఆకాశ్ హిరేమఠ్ (30)ను శనివారం రాత్రి లోహియానగర్ పవన్‌స్కూల్ వెనుకభాగంలో హతమార్చారు. ఇతడిని ఆకాశ్‌కు సన్నిహితులైనవారే దారుణానికి పాల్పడినట్టు తండ్రి శేఖరయ్య మఠపతి అనుమానం వ్యక్తం చేశారు. ఆకాశ్ మఠపతి భార్య, అత్తమామల తోపాటు 12మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకాశ్ భార్య కావ్య, అత్త శ్రీదేవి, మామ మోహన్‌నాయక్‌తోపాటు భరత్ నాయక్, అర్జున్ వగలి, సంజు కొప్పద, రాహుల్ కాంబలె, వినాయక తాళికోటి, మనోజ్, చమక్ మౌనేశ్, మహేశ్, కార్తీక రజపుత్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భార్య కావ్య, అత్త శ్రీదేవి, మామ మోహన్‌నాయక్‌ల కుట్రతోనే హత్య జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 8మందిని అరెస్టు చేశారు. ఆకాశ్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఉత్తరకన్నడ జిల్లా గోకర్ణలో నివసిస్తున్నారు. అప్పు చెల్లించాలని ఆకాశ్ వేధించేవారని శేఖరయ్య హిరేమఠ ఫిర్యాదు చేశారు.

విజయసాధనకు నిరంతర ప్రణాళికలే కీలకం



ఓరియంటేషన్ ఇగ్నైట్‌లో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): విజయసాధనకు నిరంతర ప్రణాళికలు కీలకమని విద్యార్థులు ఎక్కువసమయం చదువుకే కేటాయించాలని గ్లోబల్ అకాడమీ టెక్నాలజీ డైరెక్టర్ ఐశ్వర్య హెగ్డే అభిప్రాయపడ్డారు. సౌందర్య కళాశాలలో పీయూసీ విద్యార్థుల ఓరియంటేషన్ ఇగ్నైట్ 2024ను ప్రారంభించారు. సౌందర్య సంస్థల ఫౌండర్ సౌందర్యమంజప్ప, సీఈఓ కీర్తన్ కుమార్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఐశ్వర్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాసంస్థలు ఉత్తమంగా రాణిస్తున్నాయని కొనియాడారు. అదృష్టం అవకాశంగా రాకూడదని, నిరంతర శ్రమతో దక్కాలన్నారు. మంజప్ప మాట్లాడుతూ జీవన రూపకల్పనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. కీర్తనకుమార్ మాట్లాడుతూ ఉత్తమ భవిష్యత్తు ప్రతి విద్యార్థికి అందించాలని గుణాత్మకమైన విద్యావిధానం అమలు చేస్తున్నామన్నారు. జేఈఈ, సీఈటీ, పీయూసీలలో ఉత్తమమార్కులు సాధించినవారికి ల్యాప్‌టాప్‌లు ప్రదానం చేశారు. ట్రస్టు సభ్యులు వరుణ్‌కుమార్, ప్రతీషా కీర్తన్, నిశ్మితా వరుణ్, ప్రిన్సిపాల్ కెప్టెన్ మహాబళేశ్వర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

జాతీయ శిల్పకళాసంబరం ఆరంభం

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): శాంతామణి కళాకేంద్రం, జైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లు మహాకుంభ ఆఫ్ ఆర్ట్స్ పేరిట వారం రోజుల జాతీయ శిల్పకళ సంబరానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. పార్శ్వి పదప్ పేరిట గ్లోబల్ క్యాంపస్‌లో వారం రోజుల శిల్పకళల ప్రదర్శన నిర్వహించనున్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొననున్నారు. వర్ణచిత్రాలు, రాళ్లపైచెక్కే శిల్పులతోపాటు అన్ని విభాగాల కళాకారులను ఒక వేదిక ద్వారా ఆహ్వానిస్తున్నట్లు శాంతామణి కళాకేంద్రం ప్రతినిధులు తెలిపారు. కళతోపాటు సంస్కృతి, నైతిక విలువలు పరస్పరం పంచుకోనున్నారు. కళాత్మక సంబరం నిర్వహించడం వెనుక జాతీయస్థాయిలోని కళాకారులందరినీ ఒక చోట చేర్చడమే ఆశయమని దివ్యాంగుల కళాకారులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 29వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

అటవీశాఖ సిబ్బంది తీరుపై రైతుసంఘం, హసిరుసేనల నిరసన

శిడ్లఘట్ట, జూన్ 23: తాలూకాలోని సాదలి హోబళి దిబ్బూరహళ్ళిలో రాష్ట్రరైతుసంఘం, హసిరుసేన ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది తీరును ఖండిస్తూ నిరసన తెలిపారు. భూములలో సాగు చేసేందుకు అటవీశాఖ అభ్యంతరాలను తప్పుబట్టారు. దిబ్బూరహళ్ళి మెయిన్‌రోడ్డుమీదుగా పోలీస్‌స్టేషన్ వరకు రైతు సంఘం పదాధికారులు, రైతులు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. తలకాయలబెట్ట సమీపంలోని సర్వే 60లో సాగు భూములలో వ్యవసాయ కార్యకలాపాలకు కొంతమంది అటవీ సిబ్బంది అభ్యంతరాలు తెలపడాన్ని ఖండించారు. రైతులు సాగు చేస్తున్న భూములు అటవీశాఖకు చెందినవంటూ బెదరిస్తున్నారన్నారు. దీంతో చింతామణి డీఎస్పీ మురళీధర్ ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. అటవీశాఖ ఉన్నతాధికారులతో సంప్రదించి రికార్డుల ప్రకారం రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిరసనలో రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు మునినంజప్ప తదితరులు పాల్గొన్నారు.

అండాశయ సమస్యలకు

అల్టియాస్‌లో అరుదైన చికిత్స

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఉడుపికి చెందిన ఓ మహిళ నెలసరి సమస్యలతోపాటు నిరంతర రక్తస్రావం, కడుపునొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న బాధితురాలికి అల్టియాస్ ఆసుపత్రిలో ల్యాప్రోస్కోపిక్ ద్వారా శస్త్ర చికిత్స చేశారు. గైనకాలజిస్ట్ రమేశ్ నేతృత్వంలో గర్భాశయం తొలగింపు, అండాశయాన్ని తొలగించారు. ఇటువంటి సర్జరీ రాష్ట్రంలో తొలిసారి చేసినట్టు డాక్టర్ రమేశ్ తెలిపారు. కొన్నేళ్లకాలంగా బాధపడుతున్న 37ఏళ్ల మహిళలకు అరుదైన ఆపరేషన్ చేశామన్నారు. శస్త్రచికిత్స విజయవంతంపై ఆదివారం ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు.

అనంతలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన

అనంతపురం టౌన్/ఆత్మకూరు, జూన్ 23: సివిల్ సర్వీసెస్ 2023బ్యాచ్‌కు ఎంపికైన ఐఏఎస్‌ల బృందం అనంతజిల్లా పర్యటనకు వచ్చారు. ఇందులో సీహెచ్ కళ్యాణి (కర్నూలు జిల్లా అసిస్టెంట్ కలెక్టరు), దామెర హిమవంశీ (చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టరు), పవర్ స్వాప్నిల్ జగన్నాథ్ (గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టరు), బొల్లిపల్లి వినూత్న (అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టరు), హెచ్ఎస్ భావన (కాకినాడ), సుభామ్‌నాక్వల్ (ఎన్‌టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టరు) ఉన్నారు. ఈ బృందం ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. బెళుగుప్పమండలం రిజర్వాయర్‌కు వెళ్లి అక్కడకు నీరు ఎలా వస్తుంది..? ఎంతమేర వస్తుంది..? తాగు, సాగుకు ఏవిధంగా ఉపయోగపడుతుంది..? తదితర విషయాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత ద్వారా అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రాంత రైతులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలంలో రైతులు డ్రిప్‌ద్వారా సాగుచేసిన అరటి తోటలను పరిశీలించారు. పంటకు పెట్టుబడి, దిగుబడి గురించి రైతులతో అడిగి తెలుసుకున్నారు. అదేమండలంలో మామిడి పండ్ల తోటలను పరిశీలించారు. అనంతరం రాప్తాడు మండలంలోని హంపాపురం గ్రామంలో ఉపాధి పనుల ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్‌ను పరిశీలించారు. నార్పల మండలంలో పంటల సాగును పరిశీలించి అక్కడనుండి శ్రీసత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తికి ఐఏఎస్‌ల బృందం వెళ్లింది.



అరటి సాగును పరిశీలిస్తున్న బృందం


మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి: రైతులు

ఆత్మకూరు: పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి నూతన ఐఏఎస్‌ల బృందాన్ని రైతులు కోరారు. ఆత్మకూరులో ఫ్రూట్ ప్రాసెసింగ్ కేంద్రం, పండ్లతోటలు, డ్రిప్ పరికరాలను బృందం పరిశీలించింది. అరటి తోటను పరిశీలించారు. బీర పంట సాగుచేసిన రైతు అమర సింహాతో పంట సాగు, పెట్టుబడి, దిగుబడి, లాభాలు తదితర విషయాలపై మాట్లాడారు. పంటలు పండిస్తున్న రైతుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు బృందాన్ని కోరారు. హార్టికల్చర్ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నాకర్, టీడీపీ మండల కన్వీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

వీవీ గిరి (వర్ధంతి)



భారతరత్న గ్రహీత భారత 4వ రాష్ట్రపతిగా వ్యవహరించిన వరాహగిరి వెంకట గిరి (వీవీ) గిరి 1894 ఆగస్టు 10న బర్హంపూర్‌లో జన్మించారు. ఆయన తండ్రి జోగయ్య ప్రముఖ న్యాయవాది తూర్పు గోదావరి జిల్లాలోని చింతలపూడి నుంచి బరంపురానికి వలస వెళ్లారు. 1969 నుంచి 1974 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. అంతకుముందు ఉపరాష్ట్రపతిగాను ఉన్నారు. మైసూరు, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు గవర్నర్‌గాను వ్యవహరించారు. స్వాతంత్ర్యం రాకముందు మద్రాస్ ప్రెసిడెన్సీలో కార్మిక, పరిశ్రమలశాఖ మంత్రిగా వ్యవహరించారు. రాజకీయాల్లోకి రాకముందు మహాత్మాగాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్య మంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నా రు. కాగా కార్మికుల సమస్యలపై ఎన్నో పుస్తకాలు రచించారు. అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్యకు ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1980 జూన్ 24న కన్నుమూశారు.

పాలగుమ్మి పద్మరాజు (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం తిరుపతిపురంలో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 1939 నుంచి 1952వరకు కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా పనిచేశారు. మూడు దశాబ్దాలపాటు తెలుగు సినిమాలకు కథలు, మాటలు అందించారు. ప్రపంచ కథానికల పోటీలలో 'గాలివాన' కథకు గుర్తింపు లభించింది. తెలుగు సాహిత్యానికి అపార సేవలు అందించారు. 1983 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

ఎంఎస్ విశ్వనాథన్ (జయంతి)



ప్రముఖ సంగీతదర్శకులు ఎంఎస్ విశ్వనాథన్ 1928 జూన్ 24న కేరళ రాష్ట్రం పాల్ఘాట్ జిల్లా పాలక్కాడ్ తాలూకా ఎళప్పలి గ్రామంలో జన్మించారు. ఎంఎస్‌విగా గుర్తింపు పొందారు. కంపోజర్, గాయకుడిగా 'మెలోడీ కింగ్'గా అభిమానులచే పిలవబడ్డారు. తమిళ, మళయాళం, తెలుగుభాషలలో 800కు పైగా సినిమాలు, ఆల్బమ్స్‌కు సంగీతం అందించారు. ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, కలైమామణి, నంది అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2015 జూలై 14న కన్నుమూశారు.

కన్నదాసన్ (జయంతి)



తమిళ తత్వవేత్త కన్నదాసన్ 1927 జూన్ 24న తమిళనాడు రాష్ట్రం కారైకుడి ప్రాంతంలో జన్మించారు. కవి, చలనచిత్ర గీత రచయిత, నిర్మాత, నటుడు, సినిమా కథా రచయిత, పత్రికా సంపా దకుడు, పరోపకారి. కవియరాసు (కవులలో రాజు)గా పేరొందారు. 6వేల కవితలు, 232 పుస్తకాలతోపాటు 5వేల సినీ సాహిత్యాలు ఉన్నాయి. హిందూమతంపై రాసిన పుస్తకం పేరొందింది. ఉత్తమ గేయ రచయితగా ఫిలింఫేర్ పురస్కారం, సాహిత్యంలో పలు గౌరవాలు అందుకున్నారు. 1981 అక్టోబరు 17న జన్మించారు.

మురళి మోహన్ (పుట్టినరోజు)



ప్రముఖ నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు మురళి మోహన్ 1940 జూన్ 24న పశ్చిమగోదావరి జిల్లా చాటపర్రులో జన్మించారు. దాసరి నారాయణ రావు దర్శకత్వంలో 1974లో రూపొందిన 'తిరుపతి' సినిమాతో గుర్తింపు పొందారు. 350కుపైగా సినిమాలలో నటించారు. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ), ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లలో పలు హోదాలలో వ్యవహరించారు. సొంతంగా జయభేరి ప్రొడక్షన్స్‌పై 25 సినిమాలు రూపొందించారు. మహేశ్‌బాబు నటించిన 'అతడు' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు. ట్రస్టుద్వారా పదో తరగతి, ఇంటర్‌లో 85శాతంకంటే ఎక్కువమార్కులు, ఎంసెట్‌లో 10వేలలోపు ర్యాంకు పొందినవారికి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు.

లియోనెల్ మెస్సి (పుట్టినరోజు)



లియోనెల్ అండ్రెస్ మెస్సి 1987 జూన్ 24న అర్జెంటీనా దేశం రోసరియోలో జన్మించారు. లియో మెస్సిగా పిలువబడుతున్నారు. ఫుట్ బాల్‌లో ఆల్‌టైమ్ లీడింగ్ గోల్ స్కోరెర్‌గా నిలిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అర్జెంటీనా నేషనల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఏడుసార్లు బాలెన్ డి ఆర్ అవార్డులు, ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ షూస్ అవార్డు అందుకున్నారు. 2022 ఫిఫా వరల్డ్ కప్ విజేతగా రికార్డు తనదైన రికార్డు నెలకొల్పారు.

అరుదైన గౌరవం

కొత్తచెరువు, జూన్ 23: దక్షిణకొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్స(ఏఎస్‌జీఆర్ఎస్2024) విభాగంలో శ్రీసత్యసాయిజిల్లా కొత్త చెరువు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెద్దప్పోళ్ల శిల్పాచౌదరికి అరుదైన గౌవరం లభించింది. శనివారం దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్సలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో ఆమె నిలిచారు. దీంతో ఆ దేశానికి చెందిన వైద్యులు ఆమెకు ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందజేశారు. డాక్టర్ శిల్పాచౌదరి కర్నూలు వైద్యశాలలో వైద్య విద్యను పూర్తిచేశారు. వారణాసిలోని బెనారెస్ హిందూవిశ్వవిద్యాలయంలో గైనకాలజీ విభాగంలో పీజీ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో గైనకాలజీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు

